క్లుప్తంగా

బెండసాగు పరిశీలన



బెండసాగును పరిశీలిస్తున్న సిబ్బంది

గార : మండలంలోని శ్రీకూర్మంలో కె.సింహాచలం అనే రైతు పండిస్తున్న బెండసాగును నాబార్డు ఏటీఎం కె.రమేష్‌కృష్ణ గురువారం పరిశీలించారు. డిప్ ఇరిగేషన్ పరికరాలను హార్టీకల్చర్ విభాగం ద్వారా సబ్సిడీపై పొందవచ్చన్నారు. అనంతరం గంగపుత్ర వెజిటబుల్ ప్రొడ్యూషర్ కంపెనీ ఆధ్వర్యంలో మార్కెట్ చేస్తున్న ఫార్మ్‌లను సందర్శించారు. ఎక్కువమంది సభ్యులుగా చేరితే వివిధ ప్రభుత్వ పథకాలకు అర్హులవుతారన్నారు. కార్యక్రమంలో హెచ్‌డీఎఫ్‌సీ డైరెక్టర్ బి.వి.రమణ, రైతులు పాల్గొన్నారు.

ఆలయ పునఃప్రతిష్టాపనోత్సవాలు ప్రారంభం



అసిరితల్లి అమ్మవారు

జి.సిగడాం: మండల కేంద్రం జి.సిగడాం అసిరితల్లి అమ్మవారి ఆలయం పునఃప్రతిష్టాపన మహోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. వేద పండితుల సమక్షంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నెల 31 వరకు ఉత్సవాలు నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

అలరించిన నృత్య ప్రదర్శన



సత్కారం అందుకుంటున్న నృత్య కళాకారులు

శ్రీకాకుళం కల్చరల్: షిరిడీలో జరుగుతున్న సాయి శతాబ్ది ఉత్సవాలలో భాగంగా నగరానికి చెందిన అభినయ నృత్యనికేతన్ వ్యవస్థాపకులు నీరజా సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో శిష్యబృందం అద్భుత నృత్య ప్రదర్శనలతో అలరించారు. ఈ నెల 26 నుంచి 29 వరకు జరుగుతున్న ఈ ఉత్సవాలలో వాగ్దేవి కూచిపూడి నృత్యాలయం నాట్యాచార్యులు సప్ప శివకుమార్, నాట్యాచార్యులు ఘంటసాల పవన్‌కుమార్‌ల చేతుల మీదుగా నీరజ, శిష్యబృందం సింధు, శ్రీహర్షిత, ఊర్మిళ, వర్షిత, నవ్యశ్రీ, ధృతి, క్షీరజ్, శ్రావణి, ప్రదీతిలకు బహుమతులు అందుకున్నారు.

తోటపల్లి కాలువ ఆయకట్టు పరిశీలన



రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి త్రినాథరావు

రణస్థలం : మండలంలోని తోటపల్లి కాలువ ఆయకట్టు భూమి రైతులతో నీటి పన్ను చెల్లింపుపై చర్చించినట్లు జిల్లా వ్యవసాయ అధికారి కోరాడ త్రినాథరావు తెలిపారు. రణస్థలం మండలం వెల్బురాయి, కమ్మసిగడాం, బంటుపల్లి రైతులతో కలిసి తోటపల్లి కాలువ ఆయకట్టును గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సరంలో తోటపల్లి కాలువ నీరు విడుదలైందా లేదా అనే అంశంపై రైతులను అడిగి తెలుసుకున్నారు. మూడేళ్లుగా తోటపల్లి కాలువ నీరు రాలేదని రైతులు సమాధానమిచ్చారు. పంట సమోదులో నీటి వసతి, పంటల స్థితిగతులపై ఆరా తీశారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు వి.శ్రీనివాసరావు, మండల వ్యవసాయాధికారి విజయభాస్కర్, వీఆర్‌ఏ గౌరి, వీఏఏలు పాల్గొన్నారు.

అన్నదాన పథకానికి బియ్యం విరాళం



బియ్యం విరాళంగా అందిస్తున్న దాత

శ్రీకాకుళం కల్చరల్: రిమ్స్‌లోని సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్య దాన అన్నపూర్ణ సంఘం అన్నప్రసాద వితరణకు ఐదు క్వింటాళ్ల బియ్యాన్ని గురువారం అరసవల్లికి చెందిన గ్రేస్ హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ వ్యవస్థాపకులు బొత్స జనార్దనరావు, హేమలత దంపతులు అందజేశారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సూర రామచంద్రరావు, హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు భీమవరం బంగారం, ఉప్పాడ లక్ష్మీనారాయణ, జ్యోతి, మధురవాణి పాల్గొన్నారు. దాతలకు రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు, రిమ్స్ అన్నపూర్ణ అధ్యక్షులు గంగుల రమణబాబు, కార్యదర్శి కిల్లాన ఫల్గుణరావు అభినందనలు తెలిపారు.

కాళ్లరిగేలా తిరుగుతున్నా..



నాకు ఎటువంటి ఆస్తి లేదు. సొంతిల్లు నిర్మించుకుందామని తిరుగుతూనే ఉన్నాను. గతంలో పూరిల్లులో ఉంటే తుఫాన్‌కు ఎగిరిపోవడంతో రేకుల షెడ్‌లో ఉంటున్నాను. ఏడాదిగా పంచాయతీ కార్యాలయానికి, నాయకుల వద్దకు తిరుగుతూనే ఉన్నాను. ప్రభుత్వం స్పందించి ఇల్లు మంజూరు చేయాలి.

– కందివలస కూర్మారావు, శ్రీకూర్మం, గార మండలం

లబ్ధిదారులను ఎంపిక చేసినా..



గత టీడీపీ ప్రభుత్వంలో ఊరికి దూరంగా ఇళ్ల స్థలాలు ఇవ్వడంతో గ్రామానికి దగ్గరలో ప్రభుత్వ స్థలంలో కొత్త వారిని ఎంపిక చేసి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కేటాయించాం. సెంటున్నర స్థలం కేటాయిస్తూ, రోడ్డు కూడా డిజైన్ అయ్యింది. ఏడాదిగా వీటికి మోక్షం కల్పించాలని కోరుతున్నా పాలకులు స్పందించడం లేదు.

– గొలివి వెంకటరమణమూర్తి, సర్పంచ్, రామచంద్రాపురం

సౌకర్యాలు కల్పిస్తేనే..



వాకలవలస జగనన్న కాలనీ–ఎన్టీఆర్ నగర్‌లో రోడ్లు, డ్రైనేజీలు వేస్తే మాత్రం మరిన్ని కుటుంబాలు నివాసం ఉంటాయి. ప్రతీ ఒక్కరూ ఇల్లు నిర్మాణం చేసి మూడు రోజులు పాలు పొంగించి వెళ్లిపోతున్నారు. ఇంట్లో ఉండటానికి ఎవ్వరూ సాహసించడం లేదు. సౌకర్యాలు కల్పిస్తేనే నివాసముంటారు.

– శ్రీనివాసరావు, శ్రీకాకుళం రూరల్ మండలం

హామీ నిలబెట్టుకోవాలి



గత ప్రభుత్వం ప్రభుత్వ స్థలాలు లేని చోట్ల ప్రైవేట్ భూములు కొని లేఅవుట్‌లు వేసి ఇళ్లు మంజూరు చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కొత్త లబ్ధిదారుల సంగతి పక్కన పెడితే ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ఇళ్ల నిర్మాణం సైతం పూర్తి చేయడం లేదు.

– సనపల ఇందిర, ఇబ్రహింబాద్, ఎచ్చెర్ల మండలం

అసంపూర్తిగా..



జగనన్న కాలనీల్లో చాలావరకు ఇళ్లు అసంపూర్తిగా నిలిచిపోయాయి.గత ప్రభుత్వం ప్రతి కుటుంబానికి ఇల్లు ఉండాలన్న లక్ష్యంతో ముందుకు సాగింది. కూటమి ప్రభుత్వం వచ్చాక ఇళ్ల నిర్మాణాలను నిర్లక్ష్యం చేస్తోంది.

– అంబటి సుజాత, అరిణాం అక్కివలస, ఎచ్చెర్ల మండలం

సదుపాయాలేవీ?



ఇటీవలే ఇంటి నిర్మాణం పూర్తి చేశాను. కాలనీలో విద్యుత్ తప్ప మురుగునీరు పోవడానికి డ్రైనేజీలు గానీ రాకపోకలు చేసుకునేందుకు రోడ్లు గానీ లేవు. చుట్టుపక్కల పొలాల నుంచి వచ్చిన నీరు కాలనీ మధ్యలో చేరుతోంది.

– ఎస్.శంకరరావు, వాకలవలస జగనన్న కాలనీ

కాలనీలు.. కన్నీళ్లు!

- జగనన్న కాలనీలపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం
- వసతుల కల్పనలో తీవ్ర అలసత్వం
- కొత్త ఇల్లు మంజూరుకాక పేదల ఎదురుచూపులు
- చంద్రబాబు బూటకపు హామీపై మండిపాటు



‘వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సెంటున్నర భూమి పేదల ఇంటికి మంజూరు చేస్తోంది. మనిషి దహన సంస్కారాలు చేసేందుకు కూడా అంత భూమి సరిపోదు. మేము అధికారంలోకి వస్తే పేదలకు మూడు సెంట్ల భూమి కేటాయిస్తాం. సొంతింటి నిర్మాణానికి రూ.4 లక్షలు మంజూరు చేస్తాం..’ ఇదీ గత ఎన్నికల సమయంలో ప్రస్తుత సీఎం చంద్రబాబు చేసిన వాగ్దానాలు. తీరా గద్దెనెక్కాక పేదల ఇంటి సంగతే మర్చిపోయారు. ఏడాదిగా పేదలకు ఎదురుచూపులే మిగులుతున్నాయి. మరోవైపు గత ప్రభుత్వం ఏర్పాటైన జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయడంలో కూటమి ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోంది.



గార మండలం అంపోలు పంచాయతీ లింగాలవలసలోని జగనన్న కాలనీ

ఎచ్చెర్ల క్యాంపస్/గార/శ్రీకాకుళం రూరల్: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గ్రామాల్లో సొంత ఇల్లు లేదనే బాధతో ఎవరూ ఉండకూడదన్న లక్ష్యంతో ముందుకు సాగింది. గ్రామాల్లో ప్రభుత్వ స్థలం, ప్రభుత్వ స్థలం లేకుంటే ప్రైవేట్ స్థలం సేకరించింది. సెంటున్నర స్థలం పట్టాలను మహిళలు పేరున అందజేసింది. ఎటువంటి రాజకీయ జోక్యం లేకుండా గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే అర్హత పరిశీలించి గ్రామ వలంటీర్ ఇళ్ల పట్టా ఇంటికి వెళ్లి అందజేశారు. అనంతరం జగనన్న నవరత్నాలు– పేదలందరికీ ఇళ్లు, ప్రధాన మంత్రి అవాస యోజన కింద ఇళ్లు మంజూరు చేశారు. ఇప్పుడు పరిస్థితి మారింది. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదవుతున్నా ఇంతవరకు ఎటువంటి ఇళ్లు మంజూరు కాకపోవడంతో పేదోడి సొంతింటి కల దూరమవుతోంది.

మండలం	గత ప్రభుత్వంలో వేసిన లేఅవుట్లు	మంజూరు చేసిన ఇళ్లు
ఎచ్చెర్ల	41	1221
రణస్థలం	35	1491
లావేరు	24	382
జి.సిగడాం	26	294
గార	27	947

- గత ప్రభుత్వ హయాంలో గార మండలంలో 25 పంచాయతీలకు గాను రామచంద్రాపురం, సతివాడ, బూరవిల్లి, బందరువానిపేట మినహా అన్ని పంచాయతీల్లో జగనన్న కాలనీలు ఏర్పాటు చేశారు. అర్హతే ప్రామాణికంగా, అన్ని పార్టీలకు చెందిన అర్హులందరికీ సెంటున్నర భూమిని కేటాయించారు. ఇళ్లు మంజూరు చేయగా అవి వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయి. ఊళ్లకు ఊళ్లు తయారవుతున్నా వాటిలో మౌలిక వసతుల కల్పనపై కూటమి ప్రభుత్వం పూర్తిగా దృష్టిసారించలేదు. పల్లెపండగ పేరిట హడావుడి చేసి నిర్మాణాలను కొత్త కాలనీల వైపు కన్నెత్తి చూడకపోవడంతో వారంతా రోడ్లు, డ్రైనేజీలు కావాలని కోరుతున్నారు. మంజూరైన ఇళ్ల లబ్ధిదారులకు బిల్లులు చెల్లింపు కూడా కొద్ది మొత్తంలో విడుదల జాప్యం చేయడంతో ఇళ్ల నిర్మాణాలపై లబ్ధిదారులు దృష్టి సారించలేకపోతున్నారు. 2023 ఏడాది చివరలో 1899 ఇళ్ల మంజూరుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మంజూరు చేయగా, ఈ ప్రభుత్వం అవి రద్దు చేసి ఇప్పుడు మరలా డిమాండ్ సర్వే పేరిట మళ్లీ సర్వే చేస్తోంది. గతేడాది నవంబర్, డిసెంబర్‌లో టీడీపీ నాయకులు కొత్త ఇళ్లు మంజూరు చేస్తున్నామని హడావుడి చేయగా, అందరూ దరఖాస్తులు పట్టుకొని నాయకుల వద్దకు, అధికారులు వద్దకు తిరిగి అందజేశారు. అవి ఇప్పటికీ మంజూరు కాకపోవడంతో అసహనం వ్యక్తం చేస్తున్నారు.
- ఎచ్చెర్ల నియోజకవర్గంలో ఎచ్చెర్ల, లావేరు, రణస్థలం, జి.సిగడాంలలో 126 లేవుట్‌లు వేసి, 3,388 మంది ఇళ్ల పట్టాలను అందజేశారు. పక్కా స్థలం ఉన్నవారికి 7214 ఇళ్లు మంజూరు చేశారు. చాలా వరకు ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించగా.. కొన్ని పూర్తిచేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఇళ్ల నిర్మాణాలు ముందుకు సాగడం లేదు. ఎచ్చెర్ల, ఎస్‌ఎం పురం, తోటపాలేం, జేఆర్‌పురం, పైడి భీమవరం, మురపాక, బుడుమూరు, జి.సిగడాం, పాలఖం డ్యాం వంటి ప్రాంతాల్లో అసంపూర్తిగా ఇళ్లు మిగిలిపోయాయి.
- శ్రీకాకుళం రూరల్ మండల పరిధిలోని రాగోలు అర్బన్ లేఅవుట్ వాకలవలసలో వెలసిన జగనన్న కాలనీ–ఎన్టీఆర్ నగర్ కాలనీని సమస్యలు చుట్టుముట్టాయి. ఇక్కడ మొత్తంగా 1733 ప్లాట్‌లు ఏర్పాటు చేయగా అందులో వివిధ దశల్లో 1150 ఇళ్ల రూపకల్పన జరిగింది. ప్రస్తుతం ఈ కాలనీల్లో వంద కుటుంబాలకు పైగా నివాసం ఉంటున్నారు. ప్రధానంగా డ్రైనేజీలు, రోడ్ల సమస్య స్థానికులను వేధిస్తోంది. అధికారులు వచ్చి పరిశీలన చేయడమే తప్ప సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకోవడం లేదు.



ఎచ్చెర్లలో జగనన్న కాలనీ



ఎచ్చెర్లలో అసంపూర్తిగా నిలిచిపోయిన ఇళ్లు



వాకలసవలస జగనన్నకాలనీ మధ్యలో పారుతున్న పంట పొలాల నీరు

‘వెన్నుపోటు దినం’ విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

రణస్థలం: కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను వెన్నుపోటు పొడిచిందని, ఈ నేపథ్యంలో పేదల తరపున ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు జూన్ 4న నిర్వహించనున్న వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ ధ్వజమెత్తారు. రణస్థలం మండల కేంద్రంలోని వైఎస్సార్‌ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రణస్థలం మండల కేంద్రంలోని దన్నానపేట కూడలి నుంచి రణస్థలం తహసీల్దార్ కార్యాలయం వరకు వెన్నుపోటు దినం పేరిట నిరసన ర్యాలీ నిర్వహించి అనంతరం అధికారులకు వినతిపత్రం సమర్పిస్తామని, పార్టీ శ్రేణులంతా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు దన్నాన రాజీనాయుడు, గొర్లె శ్రీనివాసరావు, బోర సాయిరామ్ రెడ్డి, డోల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఒత్తిడి దూరం



రణస్థలం: యోగాసనాలు వేస్తున్న అధికారులు



ఎచ్చెర్ల: బొడ్డపాడులో యోగా చేస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు, అధికారులు

రణస్థలం: ప్రతి వ్యక్తి జీవితంలోనూ యోగా భాగం కావాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు అన్నారు. రణస్థలం ఇండోర్ స్టేడియంలో అధికారుల సమక్షంలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎన్.ప్రసాద్, ఎంపీడీవో ఎం.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల: లావేరు మండలం బొడ్డపాడు వద్ద సివిల్ సప్లయ్ గోడౌన్ ఆవరణలో యోగా శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు, ఎంపీడీఓ పి.వెంకటరాజు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గార: ప్రతిరోజూ యోగా చేస్తే ఒత్తిడి దూరం చేసుకోవచ్చని గార ఎంపీడీవో శిమ్మ రామ్మోహనరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా రెవెన్యూ, మండల పరిషత్ సిబ్బందితో యోగా చేయించారు. ఆయుష్ డాక్టర్ పుష్పాంజలి ఆసనాలు వేయించారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎం.చక్రవర్తి, డిప్యూటీ ఎంపీడీవో ఏ.రఘు, ఈవోపీఆర్‌డీ కూర్మారావు, వీఆర్‌వోలు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీకాకుళం రూరల్: సింగుపురంలోని కల్యాణ మండపంలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. యోగా ఆరోగ్యానికి మంచిదని శ్రీకాకుళం ఎంపీడీఓ బి.శైలజ చెప్పారు. కార్యక్రమంలో ఆయుష్ వైద్యాధికారి మహతి, ఈవోపీఆర్‌డీ సూర్యనారాయణ, డిప్యూటీ ఎంపీడీఓ కె.సత్యనారాయణ, పంచాయతీ సెక్రటరీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం న్యూకాలనీ: యోగాతో శారీరక ఆరోగ్యంతోపాటు మానసిక ప్రశాంతత లభిస్తుందని నెహ్రూ యువ కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ కె.వెంకట్ ఉజ్వల్ అన్నారు. యోగాంధ్ర–2025 వేడుకల సన్నాహకాల్లో భాగంగా నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో నగరంలోని విశాఖ–బి కాలనీలో ఉన్న సాయిబాబా మందిరం ఆవరణలో గురువారం ప్రత్యేక యోగాసనాల ప్రదర్శన నిర్వహించారు. జిల్లా నేషనల్ యువత సేవకులు, వివిధ యువజన సంఘాల సభ్యులు, యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. యోగా గురువులు మురళి, టి.స్వాతి ట్రైనర్లుగా వ్యవహరించి యోగాసనాలు వేయించారు. కలెక్టర్ పిలుపు మేరకు జరిగిన ఈ కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్రం అకౌంట్స్ ఆఫీసర్ డబ్బీరు శ్రీనివాస్, సెట్‌శ్రీ సీఈఓ బి.ప్రసాదరావు, వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు కె.మురళీధర్‌రావు, యువజన సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



శ్రీకాకుళం న్యూకాలనీ: యోగా చేస్తున్న ఎన్‌వైకే సిబ్బంది, యువత




గార: యోగా చేస్తున్న మండల అధికారులు, సిబ్బంది



శ్రీకాకుళం రూరల్: సింగుపురంలో యోగా చేస్తున్న అధికారులు

ఉమాజఠలేశ్వరునికి నక్షత్ర పూజలు



ప్రత్యేక అలంకరణలో ఉమాజఠలేశ్వరుడు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని నక్కవీధిలో ఉమాజఠలేశ్వర ఆలయంలో స్వామివారి జన్మనక్షత్రమైన ఆరుద్ర సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేకాలు, అర్చనలు అనంతరం అలంకరణ సేవ జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

కనకదుర్గకు ప్రత్యేక అలంకరణ



ఎచ్చెర్ల: లావేరు మండల కేంద్రంలోని కనకదుర్గాదేవి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు నేతేటి రుషికుమార్ శర్మ ఆధ్వర్యంలో అభిషేకాల అనంతరం వివిధ పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్థానికులతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

జాతీయ తైక్వాండో పోటీలకు పయనం



శ్రీకాకుళం న్యూకాలనీ: జాతీయ తైక్వాండో పోటీల్లో సత్తా చాటి జిల్లాకు విజేతలుగా తిరిగి రావాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు తైక్వాండో శ్రీను పిలుపునిచ్చారు. కటక్ వేదికగా ఈ నెల 30 నుంచి జూన్ 1వ తేదీ వరకూ జరగనున్న 9వ ఆలిండియా నేషనల్ ఓపెన్ తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటున్న జిల్లా క్రీడాకారులు గురువారం ఇక్కడి నుంచి పయమైవెళ్లారు. ఈ సందర్భంగా ఎంపికైన క్రీడాకారులను సంఘ ప్రతినిధులు సుధీర్‌వర్మ, తదితరులు అభినందించారు. జాతీయ స్థాయి పోటీల్లోనూ రాణించి జిల్లాకు పేరు ప్రతిష్ఠలను తీసుకురావాలని ఆకాంక్షించారు. జిల్లా బృందానికి కోచ్‌గా మజ్జి గౌతమ్, మేనేజర్‌గా హేమంత్ ఖాన్ వ్యవహరించనున్నారు.

ఉత్సాహంగా చెస్ పోటీలు

శ్రీకాకుళం అర్బన్: బలగ శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గురువారం చెస్ పోటీలు నిర్వహించారు. అంతకుముందు గ్రంథాలయ అధికారి పి.ఉగ్రసేన ఆధ్వర్యంలో పిల్లలకు నీతి కథలు చెప్పారు.

అసాంఘిక కార్యకలాపాలపై నిఘా



డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

జి.సిగడాం: గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని, అసాంఘిక కార్యకలాపాలపై నిఘా పెంచామని జి.సిగడాం ఎస్‌ఐ వై.మధుసూదనరావు అన్నారు. గురువారం ఎస్‌పీ ఆర్‌పురం, జి.సిగడాం గ్రామాల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవన్నారు. హెల్మెట్ ధరించడంతో పాటు లైసెన్స్, సీబుక్, బీమా పత్రాలు లేకుండా వాహనాలు నడిపితే జరిమానా తప్పదన్నారు. గ్రామాల్లో అపరిచితులు సంచరిస్తే వెంటనే సమాచారం అందించాలని సూచించారు.

కుట్టుశిక్షణ అభ్యర్థులకు సర్టిఫికెట్లు



సర్టిఫికెట్లు అందుకున్న మహిళలతో నిర్వాహకులు

శ్రీకాకుళం కల్చరల్:

నగరంలోని సత్యసాయి సమితి పెద్దమందిరంలో స్కిల్ డెవలప్‌మెంట్ స్కీమ్ కింద నిర్వహిస్తున్న టైలరింగ్, మగ్గం వర్కులలో శిక్షణ పొందిన మహిళలకు గురువారం సర్టిఫికెట్లు అందజేశారు. ముగ్గురు మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు మాట్లాడుతూ సత్యసాయి వందో పుట్టిన రోజు వేడుకలు జిల్లాలో ఘనంగా నిర్వహించేందుకు గ్రామ సేవా కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. పథకం కింద శిక్షణ పొందుతున్న మహిళలకు స్వయం ఉపాధి కూడా కల్పిస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం విశ్రాంత ఉద్యోగి కోటేశ్వరరావును సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు, మందిరం కన్వీనర్ కంబ మురళీ, స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌చార్జి బోయిన నర్సింహమూర్తి, నాగేశ్వరరావు, కిల్లాన ఫల్గుణరావు, భోజ్‌కుమార్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రహదారులిలా..రాకపోకలెలా?



రాళ్లపేటకు వెళ్లే బీటీ రోడ్డులో గోతులు



బురదగామారిన మెండపేట రోడ్డు

గార: తాము అధికారంలోకి వస్తే అన్ని రోడ్లు బాగుచేస్తామని, అద్దంలా మెరిపిస్తామని ఆర్భాటం పలికిన కూటమి నాయకులు.. ప్రభుత్వం ఏర్పడ్డాక ఆ మాటలే మర్చిపోయారు. ముఖ్యంగా గ్రామీణ రహదారులు గోతులమయంగా మారి బురదతో నిండినా పట్టించుకునే వారే కరువయ్యారు. శ్రీకూర్మం మేజర్ పంచాయతీ పరిధిలోని కోళ్లపేట, మెండపేట గ్రామాలకు వెళ్లే రోడ్లు అధ్వానంగా మారాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు గోతుల్లో నీరు చేరి బురదమయంగా మారడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీపావళి రోడ్డు నుంచి ఈ గ్రామాలకు వెళ్లాలంటే నరకయాతను అనుభవించాల్సి వస్తోందని వాపోతున్నారు. బైక్‌లు, సైకిళ్లు గోతుల్లో కూరుకుపోయి కింద గాయాలపాలవుతున్నామని ఆవేదన చెందుతున్నారు. ఈ విషయమై ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు